క్లుప్తంగా

కానూరులో మంత్రి పర్యటన



పెనమలూరు: రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ గురువారం కానూరులో పర్యటించారు. వైఎస్సార్ సీపీ తాడిగడప మున్సిపాలిటీ అధ్యక్షుడు అన్నే శ్రావణ్‌కుమార్, కానూరు మాజీ సర్పంచి అన్నే వేణుగోపాలకృష్ణమూర్తి(చిట్టిబాబు) మంత్రికి ఘన స్వాగతం పలికారు. గ్రామంలో ఉన్న శ్రీ కృష్ణుడి ఆలయంలో మంత్రి జోగి రమేష్ ప్రత్యేక పూజలు చేశారు. పార్టీ క్యాడర్‌ను మంత్రికి శ్రావణ్‌కుమార్ పరిచయం చేశారు. ఈ సందర్భంగా మంత్రిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు వేమూరి బాలకృష్ణ, లతీఫ్, ఆంజనేయప్రసాద్, తుమాటి శ్రీరాములు, భాస్కరరావు పాల్గొన్నారు.

తాడిగడపలో యువతి అదృశ్యం

పెనమలూరు: తాడిగడపకు చెందిన యువతి అదృశ్యం అవ్వడంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప గంగానమ్మగుడికి చెందిన పి.వెంకటరామ కృష్ణారావుకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. అతని కుమార్తె(21) ఎంబీఏ చదువుతుంది. కాగా ఈ నెల 16వ తేదీన ప్రాజెక్ట్ మెటీరియల్ తెచ్చుకుంటానని విజయవాడ బెంజిసర్కిల్‌కు వెళ్లింది. రాత్రి అయినా ఆమె తిరిగి రాలేదు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వస్తుంది. దీంతో కుటుంబ సభ్యులు ఆమె కోసం వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

పెనమలూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి చెందడంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం ఉయ్యూరు మండలం గండిగుంటకు చెందిన అమీద్(34) యుపీవీసీ తలుపులు తయారు చేసి ఫిట్టింగ్ పనులు చేస్తాడు. అతను ఈ నెల 15వ తేదీన రాత్రి బైక్‌పై ఉయ్యూరు నుంచి విజయవాడకు వెళ్తుండగా పోరంకి చేపల కుండీల వద్ద అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టాడు. అమీద్‌కు తీవ్ర గాయాలు అవ్వడంతో విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ అతను మృతిచెందాడు. ఈ ఘటనపై భార్య అన్నపూర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బస్సులో ఆభరణాల చోరీపై కేసు నమోదు

పెనమలూరు: బస్సులో ప్రయాణిస్తున్న మహిళ హ్యాండ్ బ్యాగ్‌లో ఆభరణాలు చోరీ జరగడంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల మేరకు చల్లపల్లి మండలం వెలువోలు గ్రామానికి చెందిన తోడేటి ప్రియదర్శిని ఈ నెల 11వ తేదీన విజయవాడ బస్‌స్టాండ్‌లో కరకట్టపై వెళ్లే అవనిగడ్డ బస్సు ఎక్కింది. బస్సు పెదపులిపాక గ్రామం వద్దకు వచ్చిన సమయంలో బస్ టికెట్ కొనడానికి ఆమె వద్ద ఉన్న హ్యాండ్‌బ్యాగ్ చూడగా బ్యాగ్ జిప్ తెరిచి ఉంది. బ్యాగ్‌లో ఉన్న బంగారు ఆభరణాలు కనిపించలేదు. గుర్తు తెలియని వ్యక్తులు హ్యాండ్ బ్యాగ్‌లోని ఆభరణాలు చోరీ చేశారని బాధితురాలు ఆలస్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ముగిసిన గ్రామోత్సవం



రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులోని శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా జరుగుతున్న అమ్మవారి గ్రామోత్సవం గురువారం అర్ధరాత్రి తర్వాత ముగిసింది. గత ఐదు రోజులుగా రామవరప్పాడు, ప్రసాదంపాడు గ్రామాల్లో గ్రామోత్సవం వైభవంగా జరుతోంది. పలు గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారి ఉత్సవ వాహనాన్ని అనుసరిస్తూ మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ బోయిన భానుప్రదీప్, ఆలయ ఈఓ పి.లోకేశ్వరి మాట్లాడుతూ గత ఐదు రోజుల నుంచి అమ్మవారి గ్రామోత్సవం అత్యంత వైభవంగా జరుగుతోందన్నారు. ఉత్సవాల్లో అమ్మవార్లకు హుండీల్లో సమర్పించిన ఆదాయాన్ని శుక్రవారం లెక్కిస్తామని పేర్కొన్నారు. ఉత్సవాలు ముగింపు సందర్భంగా 20న ఆలయంలో భారీ అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు.

జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీల్లో కాంస్య పతకం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కేబీఎన్ కళాశాల విద్యార్థి బాక్సింగ్ పోటీల్లో కాంస్య పతకం సాధించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు తెలిపారు. ఇటీవల చండీఘర్‌లో నిర్వహించిన ఆలిండియా సౌత్ వెస్ట్ ఇంటర్ యూనివర్సిటీ బాక్సింగ్ పోటీల్లో తమ కళాశాల విద్యార్థి సోను భార్గవ్ కృష్ణా విశ్వవిద్యాలయం తరపున పాల్గొని పతకం పొందాడని పేర్కొన్నారు. సోను భార్గవ్‌ని, ప్రోత్సహించిన వ్యాయామ విభాగాధిపతి హేమచంద్రరావును అభినందించారు.

వేడుకలా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

- కుల, మతాలకు అతీతంగా పిలుపునిచ్చిన వైనం
- స్వచ్ఛందంగా తరలి వచ్చేందుకు సిద్ధం
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయానికి ప్రశంసలు



విజయవాడ స్వరాజ్ మైదానంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం

లబ్బీపేట(విజయవాడతూర్పు): భారతజాతి గర్వించదగిన రోజు కోసం అన్ని వర్గాల ప్రజలు ఎదురు చూస్తున్నారు. దేశానికి అత్యంత శక్తిమంతమైన రాజ్యాంగాన్ని రూపొందించిన ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 206 అడుగుల కాంస్య విగ్రహాన్ని శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించనున్నారు. ఈ వేడుకను చూసేందుకు స్వచ్ఛందంగా తరలి రావాలంటూ ఇప్పటికే సందేశాలు పంపించారు. కుల, మతాలకు అతీతంగా పలు సంఘాలకు చెందిన నేతలు అత్యంత సుందర మనోహరంగా అంబేడ్కర్ స్మృతి వనాన్ని తీర్చిదిద్దినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. విజయవాడ నగరానికే ఐకాన్‌లా తీర్చిదిద్దారని అంటున్నారు. అంతేకాదు మహాత్మాగాంధీరోడ్డులో వెళ్తున్న వారు ఆ విగ్రహాన్ని చూడకుండా వెళ్లడం లేదు. ప్రతి ఒక్కరూ సెల్ఫీలు తీసుకుంటున్నారు.

స్మృతి వనం ప్రారంభోత్సవాన్ని జయప్రదం చేయండి

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని బడుగు, బలహీన, మైనారిటీ వర్గాల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాల బీసీ విభాగం జోనల్ ఇన్‌చార్జి కసగాని దుర్గరావు గౌడ్ పేర్కొన్నారు. గురువారం కృష్ణలంకలో జరిగిన విలేకరుల సమావేశంలో దుర్గారావు మాట్లాడారు. స్వరాజ్ మైదానంలో శుక్రవారం నిర్వహించే 206 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ, స్మృతివనం ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు నివాళులర్పించాలని కోరారు. వెనుకబడిన వర్గాలకు దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ఎన్నో వినూత్నమైన పథకాలు రూపొందించి వాటిని అమలు చేస్తూ వారి ఖ్యాతిని, ప్రాముఖ్యతను చాటుతూ రూ.400 కోట్లతో మహత్తర కార్యక్రమం చేపట్టిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బీసీలు కేవలం ఓటు బ్యాంకు కాదు, రాజ్యాధికారంలో భాగస్వాములు అని దేశానికి చాటి చెప్పిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఎల్లవేళలా వెన్నంటి ఉంటూ మరోసారి సీఎంని చేద్దామని తెలిపారు.

ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించండి

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజాబాబు



మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు
చిత్రంలో డీఆర్వో పెద్ది రోజా

చిలకలపూడి(మచిలీపట్నం): జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజాబాబు అధికారులకు సూచించారు. ఆయన గురువారం రాత్రి జిల్లాలోని ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జాతీయ ఓటర్ల దినోత్సవ నిర్వహణ, రాబోయే ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు తదితర అంశాలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఓటర్లను చైతన్యవంతం చేసేందుకు పెద్ద ఎత్తున ర్యాలీలు, మానవహారాలు నిర్వహించాలన్నారు. యువ ఓటర్లు, వృద్ధ ఓటర్లను సత్కరించాలన్నారు. పాఠశాల, కళాశాల విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలని చెప్పారు. ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచే విధంగా ప్రజలకు అవగాహన కలిగించేలా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పోలింగ్ కేంద్రాలు అన్నింటిలో ఫర్నిచర్, ర్యాంప్‌లు, టాయిలెట్లు, విద్యుత్ సౌకర్యం, మౌలిక వసతులు కల్పించాలన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ స్టేషన్‌ను డివిజన్ కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని సూచించారు. వీసీలో డీఆర్వో పెద్ది రోజా పాల్గొన్నారు.

జగనన్నతోనే మా ప్రయాణం



మంత్రి జోగి రమేష్‌ను సత్కరిస్తున్న ఎస్సీ నేతలు

ఉయ్యూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే తమ ప్రయాణమని, పెనమలూరు నియోజకవర్గంలో మంత్రి జోగి రమేష్‌ను గెలిపించుకుంటామని ఎస్సీ సంఘాల నేతలు, ప్రజాప్రతినిధులు స్పష్టం చేశారు. పెనమలూరు ఇన్‌చార్జిగా నియమితులైన రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్‌ను దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఐక్యవేదిక వ్యవస్థాపకుడు పినమాల నాగకుమార్ బుధవారం రాత్రి కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఎవర్ని నిలబెట్టినా ఆ నాయకుడికే తమ మద్దతు ఉంటుందన్నారు. పెనమలూరులో జోగి రమేష్ విజయం తథ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు దాసే రవి, ప్రతినిధులు గెత్తం విజయ్‌కుమార్, ఎంజే రవి, ఉయ్యూరు సుధాకర్, జానపాటి వెంకటప్పయ్య, కలవపాముల సర్పంచి పానుగుమాటి బాలస్వామి, కౌన్సిలర్ గుంజా సుధాకర్‌బాబు, గండిగుంట ఎంపీటీసీ సభ్యుడు బందెల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలి



పెనమలూరులో శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సునీతాశర్మ

పెనమలూరు: గ్రామ పంచాయతీలు అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఎంపీడీఓ సునీతా శర్మ అన్నారు. పెనమలూరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం గ్రామ పంచాయతీల సర్పంచిలు, పాలకులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ 2024–25 సంవత్సరానికి గానూ అయా గ్రామ పంచాయతీలు అభివృద్ధి ప్రణాళికలతో పని చేయాలని సూచించారు. దీని వలన పరిపాలనపై అవగాహన పెరగడమే కాకుండా బడ్జెట్ సక్రమంగా ఉపయోగించుకోవచ్చని తెలిపారు. ఈఓపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, పెదపులిపాక పంచాయతీ కార్యదర్శి పద్మావతిదేవి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

అధికారులు సమయ పాలన పాటించాలి..

కాగా ఉదయం 10 గంటలకు శిక్షణ కార్యక్రమం ప్రారంభించాల్సి ఉండగా అధికారులు రాకపోవడంతో పెదపులిపాక సర్పంచి, వైఎస్సార్ సీపీ నేత గుంటూరు శ్రీనివాసాచౌదరి అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికారులు సమయపాలన పాటించడం లేదని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని అన్నారు.

ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్లాలి

గన్నవరం: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్లాలని ఎంపీపీ అనగాని రవి సూచించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం గ్రామపంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడంపై రెండు రోజుల పాటు జరగనున్న శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రవి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా పని చేయాలని చెప్పారు. ముఖ్యంగా గ్రామపంచాయతీల ఆదాయాన్ని పెంపొందించే దిశగా దృష్టి సారించాలన్నారు. తద్వారా గ్రామాభివృద్ధికి అవసరమైన నిధులను సమకూర్చుకోవచ్చని పేర్కొన్నారు. పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన పెంచుకోవడం ద్వారా పరిపాలనపై మరింత పట్టు సాధించవచ్చని వివరించారు. 2024–25 ఏడాదికి గానూ గ్రామపంచాయతీల అభివృద్ధిపై ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ.గౌసాని, ఎంపీడీఓ ఇ.సత్యకుమార్, ఈఓపీఆర్డీ పి.వెంకటేశ్వరమ్మ, ఈఓ బాపూజీ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి కొత్త క్రెటా కారు ఆవిష్కరణ



నూతన క్రెటా కారును ఆవిష్కరిస్తున్న ఎస్పీ కరీముల్లా షరీఫ్ తదితరులు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులోని సాయిస్వర్ణ హ్యుందాయ్ షోరూమ్‌లో సరికొత్త క్రెటా కారును నగర మార్కెట్‌లోకి గురువారం విజిలెన్స్- ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్పీ కరీముల్లా షరీఫ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాయి స్వర్ణ జనరల్ మేనేజర్ భగత్ సింగ్ మాట్లాడుతూ నూతన క్రెటా కారు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, భద్రతా సౌకర్యాలు, ఆకర్షణీయమైన డిజైన్లు, మూడు రకాల ఇంజన్లతో రూపుదిద్దుకున్నట్లు వివరించారు. 360 డిగ్రీల కెమెరా, 52 అడాబ్ ఫీచర్లు, 6 ఆకర్షణీయమైన మోనో–టోన్, డ్యూయల్ టోన్ రంగుల్లో లభిస్తుందని తెలిపారు. ఈ నూతన క్రెటా కారు రూ. 10,99,900 నుంచి లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వినియోగదారులు, షోరూమ్ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నిరంగాల ప్రజలకు సంక్షేమం



తేలప్రోలులో అభివృద్ధి బోర్డును ఆవిష్కరిస్తున్న శంకర్‌రెడ్డి, ఎంపీపీ సరోజిని

ఉంగుటూరు: అన్నిరంగాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వింత శంకర్‌రెడ్డి అన్నారు. తేలప్రోలులో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని చెప్పారు. ఎంపీపీ వడ్లమూడి సరోజిని మాట్లాడుతూ ఓ వైపు సంక్షేమం, మరో వైపు అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నారని తెలిపారు. అనంతరం పార్టీ జెండాను, గ్రామ అభివృద్ధి డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. తేలప్రోలు సచివాలయం-1లో డీటీబీ రూ. 21.17 కోట్లు, నాన్ డీటీబీ ద్వారా రూ. 11.56 కోట్లు లబ్ధి చేకూరిందని ఎంపీడీఓ శేషగిరిరావు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి లాందిబోర, మండల సచివాలయ కన్వీనర్ వింత ఆదినారాయణరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు వాణి, వింత శ్రీనివాసరెడ్డి, రవికుమార్, మాజీ వైస్ ఎంపీపీ ఆర్నేపల్లి సింహాచలం, విజయకుమారి, పంచాయితీ కార్యదర్శి, వలంటీర్లు పాల్గొన్నారు.

ఫైనల్‌కు చేరుకున్న ఆటల పోటీలు

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా పోటీలు ఫైనల్ దశకు చేరుకున్నాయి. కబడ్డీ పురుషుల విభాగంలో ముస్తాబాద, పురుషోత్తపట్నం జట్లు, మహిళల విభాగంలో గన్నవరం-1, కొత్తగూడెం సచివాలయాల జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. ఖోఖో పురుషుల విభాగంలో బుద్దవరం-2, కేసరపల్లి-2, మహిళల విభాగంలో కేసరపల్లి-1, చిక్కవరం జట్లు ఫైనల్‌కు చేరుకున్నట్లు ఎంపీడీఓ సత్యకుమార్ తెలిపారు. క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్ పోటీలు సెమీఫైనల్ దశకు చేరుకున్నట్లు చెప్పారు. అన్ని విభాగాల్లో ఈ నెల 20వ తేదీన ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించి విజేతలు, రన్నర్ జట్లకు, ఉత్తమ క్రీడాకారులకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

ఎంపీటీసీ మాజీ సభ్యుడు వీరరాఘవయ్య మృతి

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం కానుమోలుకు చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు చలమలశెట్టి వీరరాఘవయ్య(94) గురువారం మృతి చెందారు. బుధవారం రాత్రి అకస్మాత్తుగా ఆయన స్వగృహంలో స్పృహ తప్పి పడిపోవడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. తలకు తీవ్రగాయం కావడంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయనకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతదేహానికి పీఏసీఎస్ చైర్మన్ చిన్నాల సత్యగణేష్‌బాబు, పలువురు పార్టీ నాయకులు నివాళులర్పించారు.

నేడు పునాదిపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష

కంకిపాడు: మండలంలోని పునాదిపాడు సచివాలయం-2 పరిధిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.అనూష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు వైద్య శిబిరం ప్రారంభమవుతుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పీవోఎస్ మిషన్ల ద్వారా టికెట్లు అందజేత



పీవోఎస్ మిషన్ల ద్వారా టికెట్ల జారీ చేస్తున్న ఆలయ సిబ్బంది

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో గురువారం పీవోఎస్ మిషన్ల ద్వారా టికెట్లు జారీ చేశారు. దేవదాయ శాఖ తన వెబ్‌సైట్‌లో సాఫ్ట్‌వేర్‌ను బుధవారం రాత్రి అప్‌డేట్ చేసింది. అయితే కొత్త సాఫ్ట్‌వేర్‌లో కొన్ని సాంకేతిక సమస్యలు ఎదురుకావడంతో గురువారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు దర్శన టికెట్ల జారీలో ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో మహా మండపం దిగువన కౌంటర్లతో పాటు ఘాట్‌రోడ్డు, స్కానింగ్ పాయింట్ వద్ద కౌంటర్లలో టికెట్ల జారీ నిలిచిపోయింది. దీంతో దేవస్థాన సిబ్బంది టికెట్ల జారీలో ఎదురవుతున్న ఇబ్బందులను అధికారుల ద్వారా ఆలయ ఈవో కెఎస్.రామారావు దృష్టికి తీసుకెళ్లారు. అయితే అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తులకు ఇబ్బందులు గురి కాకుండా వెంటనే పీవోఎస్ మిషన్ల ద్వారా టికెట్లను జారీ చేయాలని టెక్నికల్ టీమ్‌కు సూచించారు. దీంతో గాలిగోపురం వద్ద ఉన్న స్కానింగ్ పాయింట్ వద్ద పీవోఎస్ మిషన్ల ద్వారా టికెట్ల జారీ చేశారు.

స్మృతివనం ప్రారంభోత్సవాన్ని జయప్రదం చేయాలి

గన్నవరం: విజయవాడలో శుక్రవారం జరగనున్న సామాజిక న్యాయ మహాశిల్పం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం ప్రారంభోత్సవాన్ని ప్రజలు జయప్రదం చేయాలని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి గురువారం ఓ ప్రకటనలో కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రూ. 404 కోట్లుతో ప్రతిష్టాత్మకంగా అంబేడ్కర్ విగ్రహంతో పాటు స్మృతివనాన్ని తీర్చిదిద్దిందని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో అంబేడ్కర్ వాదులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరావాలి

ఉయ్యూరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ప్రజలు తరలిరావాలని దళిత ఐక్యవేదిక వ్యవస్థాపకుడు పినమాల నాగకుమార్ కోరారు. విజయవాడలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం విజయవంతంపై గురువారం దళిత ఐక్యవేదిక ప్రతినిధులతో చర్చించారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించే అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ సోలే సురేష్‌బాబు, పార్టీ మండల అధ్యక్షుడు దాసే రవి పాల్గొన్నారు.

29న పదో తరగతి విద్యార్థులకు మోడల్ పరీక్ష



ప్రజ్ఞ వికాసం పరీక్ష వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు తదితరులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 29వ తేదీ మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు పబ్లిక్ మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవం భవన్‌లో గురువారం ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో పదో తరగతి మోడల్ పరీక్ష ప్రజ్ఞ వికాసంకు సంబంధించి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు ప్రతి సంవత్సరం ప్రజ్ఞ వికాసం పేరుతో పబ్లిక్ మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నామని చెప్పారు. నిష్ణాతులైన ఉపాధ్యాయుల చేత పరీక్ష పేపర్ తయారు చేయించామని తెలిపారు. విద్యార్థులు ఈ పరీక్ష రాయడం ద్వారా పబ్లిక్ పరీక్షల్లో అధిక మార్కులు సాధించడానికి ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులందరూ ఈ పరీక్షను ఉపయోగించుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 9394755525, 8790865130, 9010849524 నంబర్లలో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వరరావు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సుందరయ్య, ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం.సోమేశ్వరరావు, రాజ్‌కుమార్, కుమారస్వామి పాల్గొన్నారు.

మామిడి సాగులో సస్యరక్షణ చర్యలు పాటించాలి



పూత రాలకుండా పిచికారి చేయు విధానాన్ని చూపుతున్న జిల్లా ఉద్యానాధికారి జ్యోతి

హనుమాన్‌జంక్షన్ రూరల్: మామిడి సాగులో సస్యరక్షణ చర్యలు పాటించాలని జిల్లా ఉద్యాన అధికారి జె.జ్యోతి అన్నారు. బాపులపాడు మండలం మల్లవల్లిలో మామిడితోటలను గురువారం ఆమె పరిశీలించారు. మామిడి సాగులో తలెత్తుతున్న సమస్యలపై రైతులను ఆరా తీశారు. పూమొగ్గలను ఉత్తేజపరిచి త్వరగా పూత రావడానికి పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు, యూరియా 5 గ్రాముల చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. తేనే పురుగు, తామర పురుగు, బూడిద తెగులు నివారణ చర్యలను ఆమె వివరించారు. బాపులపాడు మండల ఉద్యాన అధికారి ఇ.హరిచంద్, మల్లవల్లి పీఏసీఎస్ మాజీ చైర్మన్ తూము రాధాకృష్ణామూర్తి పాల్గొన్నారు.

అత్త, బావమరిదిపై దాడి కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అత్త, బావమరిది తనపై దాడి చేశారంటూ ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఏ కొండూరుకు చెందిన కొప్పుల వెంకటేష్ 6 ఏళ్ల కిందట చిట్టినగర్‌కు చెందిన పిల్లా తులసీని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఒక బాబు. కొంత కాలం కిందట పిల్లా తులసీ భర్త, కుమారుడిని వదిలేసి మరో వ్యక్తితో వెళ్లిపోయింది. దీంతో వెంకటేష్ తన కుమారుడిని తీసుకుని అత్త గారి ఇంట్లోనే ఉంటున్నాడు. కొద్ది రోజులుగా వెంకటేష్ కుమారుడికి అమ్మవారి సోకడంతో ఇంట్లోనే ఉంటున్నాడు. 17వ తేదీన బయటకు వెళ్లి వచ్చిన వెంకటేష్‌కు ఆరు బయట కుమారుడు ఉండటం చూసి కేకలు వేశాడు. దీంతో అత్త పిల్లా దేవి, బావమరిది పవన్‌కుమార్‌లు దాడి చేయడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.







- అద్భుతం.. అంబేడ్కర్ స్మృతివనం

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనం అత్యంత అద్భుతంగా తీర్చిదిద్దారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, సామగ్రితో నిర్మాణం చేపట్టారు. ఎన్నో చారిత్రక అంశాలు అందరికీ తేలికగా అర్థమయ్యేలా ఏర్పాటు చేసిన చిత్రపటాలు, విగ్రహాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

-సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ